# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

శుక్రవారం 14-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial

వైబ్రెంట్ ఎడిషన్ 4pm


అంతరిక్ష చరిత్రలో ఇదో కొత్త అధ్యాయం. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. శాస్త్రవేత్తల కృషి వల్లే చంద్రయాన్ – 3 విజయవంతం.

\- నరేంద్ర మోడీ, ప్రధానమంత్రి





లేటెస్ట్ న్యూస్



చంద్రయాన్ – 3
బరువు 3,900 కిలోలు
వ్యయం 615 కోట్లు

## ఆనందమానందమాయే..

# నింగిలోకి చంద్రయాన్-3

### ప్రయోగం విజయవంతం.. సంబరాల్లో శాస్త్రవేత్తలు..



**ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన చంద్రయాన్-3 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. మొదటి దశ విజయవంతం అయ్యింది. జాబిల్లి రహస్యాలను మానవాళికి అందించే అపురూప కార్యం విజయవంతమయ్యింది.**

**తెలుగుప్రభ, శ్రీహరికోట (జూలై 14)**

ఒకటీ రెండూ కాదు.. నాలుగేళ్ళ ఇస్రో శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషి తొలిదశ విజయవంతంగా పూర్తయ్యింది. మానవ మేధస్సుకు మచ్చుతునకలాంటి చంద్రయాన్–3 రాకెట్ నింగిలోకి దూసుకెళ్ళింది. శాస్త్రవేత్తల కరతాళ ధ్వనుల మధ్య ఆనందం అంబరాన్నంటింది. నింగికేగిన చంద్రయాన్ – 3 యావత్ భారతాన్ని నిబిడాశ్చర్యంలో ముంచేస్తూ భారత కీర్తి పతాకను దశదిశలా చాటింది. మూడు దశలు పూర్తిచేసుకొని.. విజయవంతంగా నింగిలోకి దూసుకెళుతోంది. జాబిల్లిలోని రహస్య జాడలు కనుక్కునేందుకు చంద్రాయన్ –3 నింగిలోకి దూసుకెళుతోన్న దృశ్యాలు యావత్ భారతావనిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచేశాయి. చంద్రయాన్–3 ల్యాండర్, రోవర్‌ను ఎల్‌వీఎం రాకెట్ నింగిలోకి మోసుకెళ్తుంది. 40 రోజుల పాటు సుదీర్ఘ ప్రయాణం సాగనుంది. సుమారు 3.84 లక్షల కిలోమీటర్లు ప్రయాణించనుంది. భూకక్ష్యలో 24 రోజులపాటు భ్రమణం చెందుతుంది. ఆగస్టు 23వ తేదీ లేదా 24వ తేదీన జాబిల్లిపైకి ల్యాండర్ చేరుతుంది. చంద్రయాన్–3 రాకెట్ విజయవంతంగా భూకక్ష్యలోకి చేరింది. 24 రోజుల పాటు భూకక్ష్యలో భ్రమణం చెంది.. ఆ తరువాత చంద్రునివైపు పయనించనుంది. చంద్రుడి దక్షిణ ధృవంలో చంద్రయాన్–3 ల్యాండ్ అవనుంది.

# గ్రేట్ గ్రేటర్..!

### చంద్రయాన్ రాకెట్ పరికరాల తయారీ ఇక్కడే..

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 14)**

దేశమంతా ఆసక్తిగా తిలకించిన చంద్రయాన్ – 3 మిషన్ తయారీ భాగస్వామ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పాత్ర కూడా ఉండడం గర్వించదగ్గ విషయం. భారత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు చందమామ వైపుగా నింగిలోకి దూసుకెళ్లింది. ఇస్రో చేపట్టిన ఈ జాబిల్లి ప్రయాణం వైపు 140 కోట్ల భారతీయులే కాక యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా చూసింది. తెలంగాణవాసులకు ఆసక్తికర విషయం ఏంటంటే.. ఈ చంద్రయాన్ 3 కోసం ఉయోగిస్తున్న రాకెట్‌కి కావాల్సిన కొన్ని పరికరాలు మన హైదరాబాద్‌లోనే తయారయ్యాయి. కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని నాగసాయి ప్రెసెసియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చంద్రయాన్–3 కోసం వినియోగించిన కొన్ని విడి పరికరాలను తయారుచేసింది. రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్‌లో బ్యాటరీలు ఏర్పాటు చేసుకునే విడి భాగాలను కూకట్‌పల్లిలోనే తయారు చేశారు. ప్రశాంత్ నగర్‌లోని ఈ కంపెనీ యజమాని డీఎన్ రెడ్డి 1998 నుంచి ఇస్రో ప్రయోగించిన 50 శాటిలైట్లలో పలు విడి భాగాలు అందిస్తూ వచ్చారు. ఇప్పుడు కూడా చంద్రయాన్ 3 కోసం పలు స్పేర్ పారట్స్‌ని తయారు చేసి అందించారు. కాగా, ఇప్పటివరకు చందమామపైకి వెళ్లిన ఎక్కువ శాతం వ్యోమ నౌకలు జాబిల్లిపై మధ్య రేఖ ప్రాంతంలోనే దిగాయి. కానీ భారత్ ఇప్పుడు చంద్రయాన్ 3 ప్రయోగంలోనే మరో ప్రయోగం చేస్తూ.. ఇప్పటివరకు ఎవరూ వెళ్లని దక్షిణ ధృవం వైపుకి వెళ్లనుంది. ఆ ప్రాంతంలోని భౌతిక పరిస్థితులు చాలా ప్రత్యేకంగా అనిపిస్తుండడంతో అక్కడే పరిశోధన చేయాలని భారత్ ప్రయత్నిస్తోంది. ఎన్నో కోట్ల ఏళ్లుగా అక్కడి ప్రాంతంలోని కొన్ని భాగాలు చీకట్లోనే ఉన్నాయియిన, సూర్యకాంతి చేరని కారణంగా అక్కడి మూలకాలు సౌర రేడియో ధార్మికత కారణంగా తలెత్తే మార్పులకు లోనుకాకుండా ఉంటాయని, వాటిపై పరిశోధిస్తే పలు రహస్యాలు తెలిసే అవకాశం ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.




### మంత్రి హరీష్‌రావుతో రాజాసింగ్ భేటీ..

# కారణం ఇదేనా!



**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 14)**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటుండం మామూలే. అయితే కొన్ని చర్చనీయాంశంగా మారతాయి. అలాంటిదే ఇది. బీఆర్ఎస్ నేత, మంత్రి టి. హరీశ్ రావు, బీజేపీ బహిష్కృత నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ భేటీ కావడంతో ఆసక్తిగా మారింది. గతంలో ఆయన టీడీపీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఈ భేటీతో టీఆర్ఎస్‌లోకి చేరతారని గుసగుసలు వినిపించాయి. అయితే.. ఆ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. హరీష్ రావును కలిసిన అనంతరం రాజాసింగ్ మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గ అభివృద్ధి కోసమే కలిసినట్లు చెప్పారు. కానీ ఎన్నికల వేళ కలవడంతో ఈ భేటీ వెనుక రాజకీయం కోణం ఉందనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్న సమయంలో.. రాజాసింగ్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాల్సిందిగా కేంద్ర నాయకత్వానికి అనేకసార్లు లేఖలు రాశారు. కానీ అగ్ర నాయకత్వం మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. దీంతో బీజేపీపై అసంతృప్తితో ఉన్న రాజాసింగ్‌కు ఇతర పార్టీ నుంచి ఆహ్వానాలు వస్తున్నాయి. గతంలో రాజాసింగ్‌ను తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కలిశారు. టీడీపీలో చేరాల్సిందిగా ఆయనను ఆహ్వానించారు. గతంలో టీడీపీ నుంచి రాజాసింగ్ కార్పొరేటర్‌గా పనిచేశారు. దీంతో టీడీపీలో చేరతారనే వార్తలు కూడా మీడియాలో వచ్చాయి. కానీ తనకు టీడీపీలో చేరే ఉద్దేశం లేదని స్పష్టతిస్తూ రాజాసింగ్ సోషల్ మీడియా ఒక వీడియో విడుదల చేశారు. దీంతో సైకిలెక్కుతారనే వార్తలకు చెక్ పడింది. ఈ నేపథ్యంలో హరీష్ రావును కలవడంతో రాజాసింగ్ బీఆర్ఎస్‌లో చేరతానే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ప్రచారంపై స్పందించిన రాజాసింగ్.. తాను బీఆర్ఎస్‌లో చేరతానని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. హరీష్ రావుతో జరిగిన భేటీలో రాజకీయాల గురించే అసలు చర్చించలేదని స్పష్టం చేశారు.



# మరిన్ని కంపెనీలు వస్తాయని ఆశిస్తున్నా

### మంత్రి కేటీఆర్




**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 14)**

జపాన్‌కు చెందిన మరిన్ని కంపెనీలు తెలంగాణకు వస్తాయని ఆశిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. జపాన్‌కు వెళ్లిన ప్రతిసారీ కొత్త అంశాలను నేర్చుకుంటామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా చందన్‌వల్లిఇండస్ట్రియల్ పార్కులో జపాన్‌కు చెందిన డైపుకు ఇంట్రాలాజిస్టిక్స్ యూనిట్‌కు, నికోమాక్ తైకిషా క్లీన్ రూమ్స్ కంపెనీల ఏర్పాటుకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అణుబాంబు దాడిని ఎదుర్కొని కూడా తిరిగి లేచి నిలిచి జపాన్ సత్తా చాటిందన్నారు. మన దేశంలో ప్రతి ఇంట్లో ఆ దేశానికి చెందిన వస్తువు ఏదో ఒకటి ఉంటుందని చెప్పారు. భవిష్యత్‌లో ఆ దేశానికి చెందిన మరిన్ని కంపెనీలు రాష్ట్రానికి వస్తాయని ఆశిస్తున్నామన్నారు. డైపునకు కంపెనీ దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని భావిస్తున్నానని చెప్పారు. సంస్థ రూ.575 కోట్లు పెట్టుబడి పెడుతున్నదని, మూడు నెలల్లోనే పరిశ్రమ ప్రారంభం కానుందని వెల్లడించారు. చందన్‌వల్లికి వెల్‌స్పన్, మైక్రోసాఫ్ట్ సహా అనేక సంస్థలు వస్తున్నాయన్నారు. భారత్‌కు చెందిన వెగా కన్వేయర్స్ అండ్ ఆటోమేషన్ కంపెనీతో కలిసి డైపుకు ఇంట్రాలాజిస్టిక్స్ కంపెనీ ఎక్విప్‌మెంట్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నది. మొదటి దశలో రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా 800 మందికి ఉపాధి లభించనుండగా.. తొలి దశలోనే 250 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. దీనిలో కన్వేయర్స్, షార్టర్స్ ఉత్పత్తి చేయనున్నది. ఇక నికోమాక్ తైకిషా లిమిటెడ్ కంపెనీకి వందేండ్లకుపైగా చరిత్ర కలిగి ఉంది. నిర్మాణ రంగానికి చెందిన క్లీన్ రూం ఉత్పత్తులను ఇది తయారు చేస్తారు. హెచ్‌వీఏసీ సిస్టమ్స్ ను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో రూ.126.2 కోట్లతో యూనిట్‌ను నెలకొల్పుతున్నది.

# విషాదం

## 145 మంది మృతి



**తెలుగుప్రభ, న్యూఢిల్లీ(జూలై 14):**

వరదలు ఉత్తరాధిని వణికిస్తున్నాయి. ఘోర విషాదాన్ని నింపుతున్నాయి. వరదల్లో ఇప్పటి వరకు సుమారు 145 మంది మృతి చెందినట్లు విపత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. యమునకు వరద ఉధృతి తీవ్రంగా పెరగడంతో ఢిల్లీ మునిగే పరిస్థితులేర్పడ్డాయి. ఎటు చూసినా వరదనీరే కనిపిస్తోంది. జనజీవనం స్తంభించింది. యమునా నది మహోగ్ర రూపం దాల్చడంతో ఢిల్లీకి వరద ముప్పు ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఢిల్లీలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు ఆదివారం వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వర్క్ ఫ్రమ్ హోం విదానాన్ని పాటించాలని సూచించారు.

# వరంగల్ రైల్వేస్టేషన్‌లో కలకలం

### వాటర్ ట్యాంక్ కూలడంతో నలుగురికి గాయాలు

**తెలుగుప్రభ, వరంగల్ (జూలై 14)**

అకస్మాత్తుగా వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్ కూలడంతో వరంగల్ రైల్వే స్టేషన్‌లో కలకలం రేగింది. ఈ సంఘటనలో నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో 64,000 లీటర్ల సమార్థ్యం గల ట్యాంక్ నుంచి నీటిని వదిలే సమయంలో వాటర్ ట్యాంక్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఒకటో నెంబర్ ఫ్లాట్‌ఫామ్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు నీటి ప్రవాహానికి ట్రాక్‌లపై కొట్టుకుపోయి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు అధికారులు తెలిపారు. వారిలో ఇద్దరిని ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. మరో ఇద్దరు ప్రయాణికులు, ఇద్దరు సీనియర్ సిటిజన్లు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారికి అవసరమైన వైద్యం అందిస్తున్నామని, రైల్వే శాఖ పూర్తి ఖర్చును భరిస్తోందని రైల్వే అధికారులు తెలిపారు. ప్లాట్‌ఫాం వద్ద రైలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.